- www.aknu.edu.in
- nannayavani@aknu.edu.in
- nannayanewstv
- Adikavi Nannaya University
- 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 3 | 25-10-2021 | పుటలు : 4


# దిశ యాప్‌తో మహిళలకు భద్రత

## ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ



నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి పద్మ

**23.10.21 (మీడియాసెల్)** దిశ యాప్ తో మహిళలకు భద్రత పెరిగిందని, మహిళా భద్రతను ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని దేశం గర్వించే యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం "దిశా-నిర్దేశం" పేరుతో దిశ యాప్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ దేశం గర్వించేలా అన్ని రాష్ట్రాలను ఆకర్షిస్తున్న దిశ యాప్ ను గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి గారు ఆదికవి నన్నయ యూనివర్సిటీలోనే ప్రారంభించారని గుర్తిచేసారు. ఈరోజు ప్రతీ మహిళకు దిశ యాప్ భరోసాగా, భద్రతగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళలకు ఆర్ధిక, అధికార మరియు భద్రతను జగన్మోహనరెడ్డి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సైబర్ క్రైమ్ లతో అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక పరిజ్ఞానం వికృత నేరాలకు దారితీస్తున్నాయన్నారు. భారతదేశంలో 4 శాతం మహిళల పట్ల క్రైమ్ రేటు పెరిగిందని నేషనల్ ఉమన్ కమిషన్ చెబుతుందన్నారు. కాబట్టి మహిళల జోలికొస్తే ప్రభుత్వం ఊరుకోదనే భరోసాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో స్పందనలో 80 శాతం మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉన్నత విద్యను అభ్యసించడం హర్షనీయమని అన్నారు. మహిళల భద్రత కోసం సిఎం జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన దిశ యాప్ ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఈ యాప్ ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు ఇతరులకు సహాయం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 401 కళాశాలలు ఉన్నాయని వీటిలో మొత్తం 33,377 మంది అమ్మాయిలు ఉన్నారని 26,340 మంది అమ్మాయిలతో దిశ యాప్ ను ఇన్ స్టాల్ చేయించామని చెప్పారు. విశ్వవిద్యాలయం పరిధిలో 78 శాతం మంది అమ్మాయిలు స్మార్ట్ ఫోన్ ను ఉపయోగిస్తూ దిశ యాప్ ను ఇన్ స్టాల్ చేసుకున్నారని చెప్పారు. అనుబంధ కళాశాలలతో దిశ యాప్ ఇన్స్టాల్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా నిర్వహించిన సీడీసీ డీన్ డా.ఎం.కమలకుమారిని అభినందించారు. తరువాత విశ్వవిద్యాలయ స్థాయి తొలితెలుగు వారపత్రిక నన్నయవాణి ప్రత్యేక వార్షిక సంచికను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందనలు తెలియజేసారు. మధ్యాహ్నం ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి అనుబంధ కళాశాలల అధ్యాపకులకు, కమిటీ సభ్యులకు పలు సూచనలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం, రూడా చైర్మన్ ఎం.షర్మిలారెడ్డి, మహిళా కమిషన్ డైరెక్టర్ ఆర్.సూయిజ్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పద్మావతి, జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మశ్రీ, అడ్వకేట్ రహిమున్నిసా బేగం, ఈసీ మెంబర్ డా.జె.సునీత, నిరీక్షణ, బి.శాంతికుమారి, సిడిపిఓలు పి.నాగమణి, సిహెచ్.వి.నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.




నన్నయవాణి వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

## సంపాదకీయం




# నగ్నసత్యం

సత్యం, అసత్యం స్నానానికి వెళ్లాయి. స్నానంచేసి పైకి వచ్చిన తర్వాత ముందుగా అసత్యం ఒడ్డుకు చేరింది. ఒడ్డునున్న సత్యం బట్టలను తాను వేసుకుంది. చాలా బాగున్నాయని మురిసిపోయింది. అసత్యం సత్యం బట్టలను వేసుకోవటంతో సత్యంలా కనిపిస్తుంది. కాసేపటికి సత్యం పైకి వచ్చి తన బట్టల కోసం వెతుక్కుంటూ అసత్యాన్ని చూసింది. ఆ బట్టలు నావి, నీవు అలా వేసుకుంటే ఎలా, నిన్ను సత్యం అనుకుంటారు...ఏవి...నా బట్టలు నాకు ఇచ్చేయమంది. నాకు ఇవి చాలా బాగున్నాయి...కాబట్టి నీవు నా బట్టలు వేసుకోమంది అసత్యం. నేను నీ బట్టలు వేసుకోకూడదు... ఎందుకంటే నేను సత్యాన్ని. నీవు అసత్యానివని చెప్పింది. అయినా ఆ మాటల్ని వినకుండా సత్యం బట్టలు ఇవ్వకుండా అసత్యం

నడచి ముందుకు వెళుతుంది. చూసే వాళ్లకు అసత్యం సత్యంలా కనిపిస్తుంది.

బహుశా చాలా అసత్యాలు సమాజంలో ఇలాగే సత్యాలుగా చలామణి అవుతుంటాయి.

సత్యం తాను అసత్యం బట్టలు వేసుకోకూడదు కాబట్టి వెనుక నడుస్తోంది. నిజమైన సత్యం అంటే... అదిగో వెనకాల నడిచి వస్తోంది... అదే 'నగ్నసత్యం'!


అది తెలుసుకోగలిగితే చాలు.
వినదగునెవ్వరు చెప్పిన,
వినినంతనె వేగపడక....
సరిగ్గా తెలుసుకుని అబద్ధమో, నిజమో తెలిసిన మనుజుడెపో నీతిపరుడు
మహిలో సుమతీ!అన్నారు బద్దెన కవి.
నిజం నిలకడమీద తేలుతుందని పెద్దలంటారు. అవును అది నిజమే!

**సత్యమేవ జయతే!!**

## మంచి మాట

'నిజం' కూడా ప్రతిరోజు ప్రచారంలో ఉండాలి. లేకుంటే 'అబద్ధం' నిజంగా మారి ఈ లోకాన్ని నాశనం చేస్తుంది.

– డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్



# చదువు నవల | పుస్తకం



"చదువు" నవల 1952లో పుస్తక రూపంలో ప్రచురించబడింది. అంతకు ముందు ఆంధ్రజ్యోతి మాసపత్రికలో 1950 నుండి నవంబరు 51 వరకు ధారావాహికగా ప్రచురింపబడింది. ఈ నవలలో రచయిత తన భావనను 'సుందరం' పాత్ర ద్వారా చూపించారు. రచయిత మాటల్లో చెప్పాలంటే "విద్య అంటే జ్ఞానం సంపాదించటం, జ్ఞానం రెండు విధాలు. పుస్తక జ్ఞానమూ, అనుభవ జ్ఞానమూ, ఈ రెండు రకాల జ్ఞానమూ విద్య ద్వారా లభ్యం కావాలి" (కొడవటిగంటి కుటుంబరావు,1974) ఇంచు మించు ఈ అభిప్రాయాన్ని నిరూపిస్తూ రాసిన నవల "చదువు". ఈ నవలలో రచయిత జీవితం కథావస్తువుకు చాలా దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. కాని చాలా మంది సుందరం పాత్ర రచయిత జీవితానుభవాల నుంచి వచ్చిందని లేదా రూపొందిందని అభిప్రాయ పడుతుంటారు. కాని ఒక సందర్భంలో రచయిత చదువు నవల తన ఆత్మకథ కాదని అందులో ఉన్న సన్నివేశాలు, సంఘటనలు తాను చూసినవేనని సుందరం పాత్రను కేంద్రంగా చేసుకొని ఈ నవలను చూడకూడదనీ, సామాజిక చరిత్రకు ప్రాధాన్యతనివ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ నవలలో రచయిత జీవితం, అనుభవాలు ప్రతిఫలించాయి. అవి ఆనాటి సామాజిక జీవితాన్ని చిత్రికరించటానికి ఉపయోగపడిన అనుభవాలు. అంతే తప్ప రచయిత జీవితం కాదు. కనుక ఇది రచయిత ఆత్మకథ కాదని గర్తించాలి. ఈ నవలలో 1915 నుండి 1935 వరకు భారతదేశంలో జరిగిన చరిత్రను సామాజిక కోణం నుండి చిత్రించడం కనిపిస్తుంది. కనుక రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో వచ్చిన పరిణామాలు ఈ నవలలో చక్కగా వర్ణించబడ్డాయి. రచయిత ఒక సందర్భంలో నవల గురించి చెప్తూ, "నవలాకారుడు తనకు పరిచయమైన





వాతావరణాన్ని, జీవితాన్ని, పాత్రలోను మాత్రమే సృష్టించగలడు. 'చదువు' నవలలో డిప్రెషన్' (ఆర్థిక మాంద్యం)కు ముందు ఇరవై సంవత్సరాల సాంఘిక వాతావరణాన్ని చిత్రించటానికి ప్రయత్నించాడు.
అయినప్పటికీ ఇదే కాలంలో జరిగిన పరిస్థితులను వర్ణిస్తూ ఇంకో ఇరవై నవలలు రాయటానికి అవకాశం ఉంది" (కుటుంబరావు 1969) అన్నారు. దీన్ని బట్టి –ఒక నవలలో ఒక నాటి సంఘజీవితం ప్రతిఫలించే అవకాశం ఉంది కాని ఒకే నవలలో ఆనాటి సమాజం పూర్తిగా ప్రతిఫలించదు అని, ఒక కోణం మాత్రమే ప్రతిఫలిస్తుంది అని గ్రహించాలి. ఈ అవగాహనతో చదువు నవలను అర్థం చేసుకోవచ్చు. చదువు నవలలోని ముఖ్య వస్తువు ఆనాటి విద్యావిధానం. అంటే స్వాతంత్ర్యానికి ముందు ఉన్నవిద్యావిధానం, ఆనాటి ప్రజల్లో దేశీయ విద్యకు ఉన్న ఆదరణ, ఆంగ్ల విద్య అవశ్యకత పట్ల ప్రజల్లో ఉన్న అవగాహన వంటివి ఈ నవల ద్వారా అవగతమవుతాయి. ఒక సామాజిక వర్గానికి సంబంధించిన కుటుంబాలలో ఐదవ ఏటనే పుట్టువెంట్రుకలు తీసి శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేసి వీధి బడులకు పంపించేవాళ్ళు. ఆ వీధి బడుల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానూ, మాస్టర్ల సంఖ్య తక్కువగాను ఉండేది. అంటే ఒకళ్ళో, ఇద్దరో మాత్రమే ఉండేవారు. మాస్టర్లకు జీతభత్యాలు అంతంత మాత్రంగా ఉండేవి. పిల్లలకు చదువు రావాలంటే వాళ్ళకు భయభక్తులు ఉండాలని, అందుకు పిల్లలను కొట్టడం, తిట్టటం అవసరమని మాస్టర్లు భావించేవాళ్ళు. దీనివల్ల కూడా పిల్లలలో చదువు పట్ల ఆసక్తి తక్కువగా ఉండేదని తెలుస్తుంది.

బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో ఆంగ్ల విద్యావిధానం ప్రవేశ పెట్టటం వల్ల ఉన్నత పాఠశాల చదువు పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు వీధి బడుల నుంచి ఉన్నత పాఠశాలకు మారి తమ చదువులను కొనసాగించారు. అలాగే స్కూలుఫైనలు తరువాత కొంత మంది విద్యార్థులు టైపు, షార్ట్ హాండ్ పట్ల ఆసక్తి చూపేవారు. ఇది నేర్చుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు వెంటనే దొరుకుతాయని వాళ్ళు అభిప్రాయపడేవాళ్ళు. ఇదే కాకుండా ఉన్నత విద్య అభ్యసించటం కొరకు చదువును కొనసాగించేవాళ్ళ వర్గం కూడా ఉండేదని సుందరం పాత్ర ద్వారా సూచించారు రచయిత. సుందరం స్కూలు ఫైనల్ తరువాత ఇంటర్, బి.ఎ., తరువాత ఎల్.ఎల్.బి, ఎం.ఎ. చేయటానికి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్లాడు. అలాగే టైపు, షార్ట్ హాండ్ నేర్చుకొని ఉద్యోగంలో స్థిరపడేవారు కొందరు ఉంటారని సుందరం స్నేహితుడైన నాగేశ్వరరావు పాత్ర ద్వారా సూచించారు. ఈ విధంగా, ఆనాటి చదువుకున్న యువకుల అభిప్రాయాలను ఈ రెండు పాత్రల ద్వారా రచయిత చక్కగా సూచించారు. దీన్ని బట్టి ఆనాటి విద్యార్థులలో ఒకవైపు చదువుతూనే అది జీవనోపాధికి ఉపయోగపడాలనే ఆకాంక్ష ఉండేదనీ, కొంతమంది ఉపాధి కంటే ఉన్నత విద్యను అభ్యసించాలని భావించేవారని తెలుస్తుంది. తప్పక చదవాల్సిన తెలుగు నవలల్లో 'చదువు'ఒకటి.

## మాటల వంతెనొకటి నిర్మించుకుందాం !

మరణం కన్నా బాధాకరమైన మౌనాన్ని
యుద్ధం కన్నా భయంకరమైన నిశ్శబ్దాన్ని
ఎన్నేళ్ళిలా భుజాలమీద మోస్తాం?
సంధికి నాంది పలుకుదాం రా!
ఒకరి వెనుక వేరొకరు చేరి
గోతులు తవ్వుకొని నవ్వుకోవడం
ఒకరి బలహీనతల మీద
మరొకరు సింహాసనం
వేసుక్కూర్చోవడం
ఎన్నాళ్ళిలా నాటకాన్ని రక్తికట్టిస్తాం?
హృదయ వేదిక మీద
ఎదురెదురుగా కూర్చొని
చర్చించుకుందాం రా!
దారి పొడుగునా
విమర్శల ముళ్ళపొదలు
ఎదురుపడితే ప్రేమగా
పలకరించుకోలేని
అగాధపు దారులు
అపార్థాల అపనమ్మకాల
ఎగసిపడే అగ్నికీలలు



ఎంతకాలమని
అదే దారిలో నడుస్తాం
మాటల వంతెనొకటి
నిర్మించుకుందాం రా!

– సాంబమూర్తి లండ, శ్రీకాకుళం.
9642732008




## ప్రతిభా వాణి

### ఎం.ఎన్. రాయ్

(మార్చి 21, 1887 - జనవరి 25, 1954)



మానవేంద్ర నాథ్ రాయ్ హేతువాది, మానవతావాది. రాజకీయ సిద్ధాంతకర్త, రచయిత,, 20వ శతాబ్దపు ప్రముఖ తత్వవేత్తలలో ప్రముఖులు. రష్యా తరువాత ప్రపంచంలో మొదటగా మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి రాయ్. మొట్టమొదటి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కి మెక్సికో అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. రష్యాలో లెనిన్ మరణానంతరం స్టాలిన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాయ్ కార్యశీలక కమ్యూనిస్టు రాజకీయాలనుండి తప్పుకుని భారతదేశం వచ్చి రాడికల్ డెమొక్రాటిక్ పార్టీని స్థాపించారు. వారు తీసుకు వచ్చిన మానవతావాద ఉద్యమం పలువురు మేధావులను ఆకర్షించింది. మన దేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే భావనను ప్రతిపాదించిన మొట్టమొదటి భారతీయుడు. యం.ఎన్.రాయ్. బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. భారతదేశంలో మార్క్సిస్టు ఉద్యమ పితామహుడు. కాంగ్రెస్ పార్టీ కోరుతున్న స్వాతంత్ర్యానికి ధీటుగా, రాజ్యాంగం రావాలని, సంఘం మారాలని, పునర్వికాసం వైజ్ఞానిక ధోరణి ప్రబలాలని ఎం.ఎన్. రాయ్ తెలియజేశాడు. బ్రిటిష్ వారు ఎలాగూ దేశం వదలి పోతారు, రెండో ప్రపంచ యుద్ధానంతరం అది జరిగి తీరుతుందని ఎం.ఎన్. రాయ్ కచ్చితంగా చెప్పాడు. ఆలోగా ఫాసిస్టులు, నాజీ నియంతలు, మన దేశంలో బలపడకుండా జపాన్ తిష్టవేయకుండా చూడాలన్నారు. తాత్కాలికంగా బ్రిటిష్ వారికి యీ రంగంలో చేయూత నివ్వాలన్నారు. రాయ్ బహుభాషా ప్రావీణ్యం కలవారు. 17 భాషలు వారికి తెలుసు. ఆంగ్లము, జర్మన్, ఫ్రెంచి, రష్యన్, స్పానిష్ మొదలగు భాషలలో వ్రాయడం, మాట్లాడడం, చదవడం వారికి వచ్చును.

#### రాయ్ గురించి ప్రముఖుల అభిప్రాయాలు...

- నెహ్రూ తన జీవిత చరిత్రలో రాయ్ ను "మహా మేధావి"గా వర్ణిస్తూ ఆయన ముందు తానొక సామాన్య వ్యక్తిగా చెప్పుకున్నారు.

- మెక్సికో ప్రతినిధిగా రష్యాకు వెళ్ళి అప్పటి రష్యా నాయకుడు లెనిన్ ను కలుసుకున్నారు. లెనిన్ రాయ్ ని చూసి " మీరు యువకులా! మిమ్మల్ని పాక్ దేశానికి చెందిన వయసు మిరిన గడ్డం గల జ్ఞానిగా ఊహించుకున్నాను. అని అశ్చర్య పోయాడు.

# నైపుణ్యాభివృద్ధితో మంచి ఉద్యోగాలు

**21.10.21** **(మీడియాసెల్)** నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి స్కిల్ కాలేజ్ లు, యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నారని వీసీ ఆచార్యమొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యం లో గురువారం మిరాకిల్ సాఫ్ట్వేర్ సిస్టమ్స్ తో పూల్ క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుండి సుమారు 400 మంది యువతీ యువకులు ఈ డ్రైవ్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సాఫ్ట్ వేర్ ట్రైనీ, యూఎస్ ఐటీ బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, జేఎస్ ఐటీ రిక్రూటర్, పీఎంవో ఎగ్జిక్యూటివ్ తదితర ఉద్యోగాల కోసం బీటెక్ లో (సీ.ఎస్.ఈ, ఈ.సీ.ఈ, ఐ.టీ) ఎంసీఏ, ఎంబీఏలలో 2020/2021 సంవత్సరంలో ఐటీ ఉత్తీర్ణులైన యువతీయువకులు ఈ డ్రైవ్ కు హాజరయ్యారు. క్యాంపస్ డ్రైవ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు మన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని స్కిల్ యూని వర్సిటీలు, స్కిల్ కాలేజ్ లను ఏర్పాటు చేస్తున్నారని దీనిలో భాగంగా ఆదికవి నన్నయవిశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్ లో స్కిల్ కాలేజ్ ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. విద్యాభ్యాసం పూర్తయిన విద్యార్థులకు ఎటువంటి అనుభవం లేకపోయినా తొలిసారిగా ఉద్యోగాన్నిఇచ్చి ప్రోత్స హించిన సంస్థను ఎప్పటికి మర్చిపోకూడదని అన్నారు. ఉన్న స్థానంలో నుండి ఉన్నత స్థానాల్లోకి యువతరం చేరుకోవాలని తెలియజేసారు. యూనివర్సిటీలో మరిన్ని ఉద్యోగావకాశ కార్యక్రమాలు నిర్వహిస్తామని సూచించారు. చక్కని పూల్ డ్రైవ్ ను నిర్వహించిన నిర్వహకులనువీసీ అభినందించారు. యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. బి. జగన్మోహన్ రెడ్డి, జిల్లానైపుణ్య అభివృద్ధి అధికారి డి. హరిశేషు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.పెరుమాళ్లరావు, పి.వినోద్,పద్మావతి, కంపెనీ హెచ్.ఆర్ లు రమేశన్, కళ్యాణ్, సారధి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యమే ముఖ్యం

## నన్నయలో సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించిన వీసీ



సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్న వీసీ

**22.10.21** **(మీడియాసెల్)** ప్రస్తుత ఆధునిక యుగంలో మానసిక రుగ్మతలతో ఎక్కువ మంది ఇబ్బందులు పడుతున్నారని, వాటి నుండి రక్షించడానికి సైకాలజిస్టులు కృషి చేయాలని మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమైనదని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ హెల్త్ సెంటర్ లో ఆధునిక వసతులతో "సెంటర్ ఫర్ సైకాలజికల్ అసెస్మెంట్ అండ్ కౌన్సిలింగ్" ను ఏర్పాటు చేసారు. సెంటర్ గౌరవ డైరెక్టర్, ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి సైకాలజికల్ కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పోటీతత్వం, ఒత్తిళ్ళు, సమస్యలతో ఎక్కువ మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని, అటువంటి వారికి చక్కని సైకాలజికల్ కౌన్సిలింగ్ సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్ ను ఏర్పాటు చేసామని అన్నారు. కొవిడ్ సంక్షోభంలో భయాందోళ నలు నుండి ప్రజలను కాపాడేందుకు ఆదికవి నన్నయ యూని వర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ నిర్వహించిన 24 గంటల ఆన్లైన్ కౌన్సిలింగ్ సేవలకు విశేష స్పందన వచ్చిందని అన్నారు. నవమాజవి౦త వ్మై౨ న ఇటువంటి కార్యక్రమాలు విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరియు ఆత్మసంతృప్తికి ప్రతీకలని చెప్పారు. యూనివర్సిటీలో ప్రారంభించిన ఈ సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా అన్ని మానసిక సమస్యలకు పరిష్కారాన్ని అందిస్తారని తెలిపారు. వ్యక్తిగత కౌన్సిలింగ్, గ్రూప్ కౌన్సిలింగ్, వివాహానికి ముందు కౌన్సిలింగ్, కుటుంబ కౌన్సిలింగ్, బాల్య మరియు కౌమారదశ కౌన్సిలింగ్, సైకాలజికల్ అసెస్మెంట్, కెరీర్ అసెస్మెంట్, డి అడిక్షన్ కౌన్సిలింగ్ వంటి కౌన్సిలింగ్ సేవలను అందిస్తారన్నారు. ముఖ్యంగా అధ్యాపకులకు, విద్యార్థులకు అవసరమైన కౌన్సిలింగ్ సేవలు సెంటర్ ఫర్ సైకాలజికల్ అసెస్మెంట్ అండ్ కౌన్సిలింగ్ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఈ సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైకాలజీ విద్యార్థులు నూతన అంశాలపై పరిశోధనలు చేపట్టాలని,మానసిక రుగ్మతలకు కారణాలను అన్వేషించి వాటి మూలాలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని తెలియజేసారు. సెంటర్ ఇన్చార్జ్ డా.పడాల రాజశేఖర్, కన్సల్టెంట్ సైకాలజిస్టులు డా.సిహెచ్.ఎన్.కె.భవాని, డా.నారా యణ నక్కిన మరియు పరిశోధక విద్యార్థులు, సైకాలజీ విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య.ఎస్.టేకి, విభాగాధ్యాపకులు డా.పి.రాజశేకర్, డా.సిహెచ్.ఎన్.కె.భవాని, డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కె.వి.స్వామి, డా.సుంకర వెంకటేశ్వరరావు, సుంకర నాగేంద్రకిషోర్, స్పృహ అలుమ్ని అసోసియేషన్ సభ్యులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆకాశదేశానా...

## విశ్వవిద్యాలయం - ప్రకృతి సౌందర్యం

నిర్వచనానికి సులభంగా లొంగని భావనలలో అగ్రశ్రేణికి చెందినది కళాభవన. యదార్ధంగా సృష్టిలో గతి తప్ప స్థితి లేదు. అద్భుతమైన గతిని స్థితి అంటున్నాం.కళ అనేది ఒక సృజన. అది కౌశలంతో కూడిన పని. ప్రకృతిని చిత్రించటం, ఒక రూపాన్ని తీసుకొనిరావటం అది మనిషి యొక్క మనో ముద్రకు రూపాన్ని ఇవ్వటమే. ఈ మనోముద్రను కళాకారుడు బాహ్య ప్రకృతి నుంచి అందుకుంటాడు. లేదంటే తన అంతర్ జగత్తు నుంచి అందుకొని మనకి వివిధ రూపాల్లో ప్రదర్శింప చేస్తాడు. కాబట్టి బాహ్య ప్రకృతికీ అంతర్ జగత్తులు రెండింటి సమ్మేళనమే కళ.

కల్పన వాస్తవాల సమ్మేళనమే కళ. పాశ్చాత్య దర్శనశాస్త్రంలో ఐదు విభాగాలు ఉన్నాయి.1.తర్కం

### చిత్రం'...భళారే...విచిత్రం!

2.సౌందర్య తత్వం 3. నీతి శాస్త్రం 4.రాజనీతి 5. ఆది భౌతికతత్వం. ఇందులో మన భారతీయ సంస్కృతి సౌందర్య తత్వానికి గొప్ప విలువనిచ్చింది. అటు వస్తువులోని సౌందర్యాన్ని ఇటు మనిషిలోని రసచేతనను సౌందర్య తత్వం సమ్మేళనం చేస్తుంది. ఆ సౌందర్య తత్వాన్ని వస్తు రూపంగా, చిత్ర రూపంగా చూసినప్పుడు పరమాద్భుతమైన మానసిక ఆనందం బయటికి వస్తుంది.

విశ్వవిద్యాలయ భవనాల వరండాల మీద తిరుగుతున్నప్పుడో, ప్రాంగణంలో అడుగిడుతున్నప్పుడో కాసేపు మొబైల్ ఫోన్ లో నుంచి తలను బయటికితీసి మెడను పైకెత్తి ఆకాశాన్ని దర్శించినప్పుడు ఒక అనంత తత్వం కనిపిస్తుంది. బాహ్య జగత్తును పరిశీలించినప్పుడు మొక్కలు, కొమ్మలు, రెమ్మలు, పువ్వులు, పిట్టలు వాటి కూతలు ఇలా సౌందర్యాన్ని చూడగలుగుతాం. ఆ సౌందర్యం ఎక్కడ డబ్బు పెట్టి కొనేది కాదు. మార్కెట్లో దొరికేది అంతకన్నా కాదు. ఆ రసస్పర్శ మానసికంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ సౌందర్యాన్ని కెమెరాతో బంధించి తాను సంతోషించి, పది మందిని సంతోషింపచేయాలనే ఆలోచన కలుగుతుంది. అలా ఆలోచించిన విద్యార్థుల సౌందర్య తత్వానికి, ఫోటోగ్రఫీ అభిలాషకు ఈ చిత్రాలు తార్కాణాలు. మొబైల్ ఫోన్ కాసేపు పక్కన పెట్టి ప్రకృతిని ఆస్వాదించే, మానసిక ప్రశాంతతను పొందే విద్యార్థులందరికీ శుభాభినందనలు!!

- నన్నయ వాణి






ఫోటోగ్రఫీ :
- వై.కీర్తన
బి.టెక్ (ఈఐఈ)అనూర్.

ఫోటోగ్రఫీ : షరీఫ్, యూనివర్సిటీ స్టాఫ్










ఫోటోగ్రఫీ : వర్మ, సైకాలజీ











ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in